క్లుప్తంగా

ఉత్తమ గవర్నర్‌గా 'గోనుగుంట్ల'



తెనాలిఅర్బన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సూపర్‌బెస్ట్ గవర్నర్‌గా తెనాలికి చెందిన గోనుగుంట్ల జయంత్ కుమార్‌ను శనివారం అవార్డు అందుకున్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హాల్‌లో శనివారం వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అవార్డ్స్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. అక్కడ జయంతి కుమార్‌ను సన్మానించి మెమొంటో అందజేసినట్లు సభ్యులు తెలిపారు. క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పి.గాయత్రి, గోనుగుంట్ల సుజాత, ఎం.నాగభూషణం, ఎం.సత్యప్రసాద్, కె.కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

యోగా క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర యోగా క్యాలండర్‌ను శనివారం పూజ్యశ్రీ బాలస్వామిజీ ఆవిష్కరించారు. ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా బాలస్వామిజీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరారు. కార్యక్రమంలో మహాత్మ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాలి రామలింగాచారి, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, రావూరి సుబ్బారావు, మానేపల్లి శివ, గోపు రామకృష్ణ, కె.లక్ష్మి, అనూష, ప్రభారాణి, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందెబాల చంద్రమౌళి ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జి.నాంచారయ్య చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులందరికీ నూతన సంవత్సరంలో మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దుగ్గిరాల యూనిట్ సహాధ్యక్షుడు శ్రీవంకదార సుబ్బారావు, సెక్రటరీ తిప్పారెడ్డి మనోహర్‌రెడ్డి, ఆర్ఐ చందు శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ బెజ్జం కోటేశ్వరరావు(సాయి), వీఆర్‌వోలు కళాధరి, షేక్ బాషా, బొడ్డు కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అఖండ నాదోపాసన



తెనాలి: బ్రాహ్మణ పరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు, 'కలైమామణి' బ్రహ్మశ్రీ తాడేపల్లి లోకనాథశర్మచే 12 గంటలపాటు అఖండ నాదోపాసన నిర్వహించనున్నారు. ప్రకృతివైపరీత్యాల నివారణ, విశ్వమానవ కల్యాణం, విశ్వశాంతి, కరోనా మహమ్మారి శాశ్వతంగా తొలగిపోవాలన్న ఆకాంక్షతో ఆదివారం సాయంత్రం ఆరు గంటల్నుంచి సోమవారం ఉదయం ఆరు గంటలవరకు నాదోపాసన ఉంటుందని తెలియజేశారు. కొత్తపేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో జరిగే నాదోపాసనలో సంగీత విద్వాంసులు, సంగీతాభిమానులు పాల్గొని జయ ప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మె శనివారంతో ఐదో రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు ఉరితాడులు మెడకు వేసుకున్ని నిరసన తెలియజేశారు. యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్, ఎస్సీ విభాగం కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షుడు నలుకుర్తి రమేష్ కోరారు. శనివారం తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో ప్రకాష్ మాట్లాడుతూ విజయవాడలో ప్రభుత్వ నిధులతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఈ విగ్రహాన్ని జనవరి 19న దళిత బాంధవుడు, పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఇష్టపడి చదివితే విజయం తథ్యం

- ఎంపీపీ చెన్నకేశవులు
- విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



కొలకలూరు జడ్పీ హైస్కూల్లో మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు, జడ్పీటీసీ ఉమాప్రణతి



జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్స్ అందుకున్న పెదరావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

తెనాలిటౌన్: విద్యార్థులు ఇష్టపడి పట్టుదలతో చదవాలని, విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైనదని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు సూచించారు. రూరల్ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్‌ను 10వ తరగతి విద్యార్థులకు ఎంపీపీ చెన్నకేశవులు, జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, స్కూల్‌కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌లు అందజేశారు. అనంతరం జగిరిన సభకు ఇన్‌చార్జి హెచ్‌ఎం అడుసుమల్లి పద్మ అధ్యక్షత వహించారు. సభలో ఎంపీపీ మాట్లాడుతూ క్రమశిక్షణతో కష్టపడి చదవాలన్నారు. జడ్పీటీసీ ఉమాప్రణతి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అత్యధిక మార్కులు సాధించి 'జగన్న ఆణిముత్యాలు' పారితోషకం అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అనిల్, ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎస్.కల్పన, ఉపాధ్యాయులు ఎం.అన్నారావు, బాలునాయక్, పూర్ణచంద్రరావు, మారుతీ కిరణ్, లక్ష్మీనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెదరావూరు జడ్పీహెచ్‌ఎస్‌లో...

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామ జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. 80 మంది ఇంగ్లిష్ మీడియం, 41 మంది తెలుగు మీడియం విద్యార్థులకు మెటీరియల్‌ను హెచ్‌ఎం పి.సరళ, ఉపాధ్యాయులు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకట అప్పారావు, సాయిబాబు, ప్రదీప్‌కుమార్, మధుమయి, ఉమాదేవి, సునీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



తెనాలిలో వాలీబాల్ ఆడుతున్న మహిళలు



షటిల్ ఆడుతున్న యువకులు

ఐదు క్రీడాంశాల్లో ప్రతిభ చూపుతున్న యువకులు, మహిళలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శనివారం సైతం కొనసాగాయి. పట్టణంలోని 20 క్రీడా మైదానాల్లో వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ వంటి పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీడీలు న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు.

క్షణికావేశంతోనే అనర్థాలు

- రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత
- తెనాలి సబ్ జైలు సందర్శన



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీసీత

తెనాలిరూరల్: క్షణికావేశంతోనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, నేరాలకు పాల్పడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత అన్నారు. తెనాలి సబ్ జైలును శనివారం ఆమె సందర్శించారు. ఖైదీలకు ఇస్తున్న ఆహారాన్ని, జైలు ఆవరణను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. గతంలో చేసిన పొరబాట్లను ఇకపై చేయకుండా ఉండేలా జైలులోనే మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సలహా అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది ఖాదర్ హుస్సేన్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్, న్యాయశాఖ సిబ్బంది మహబూబ్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ కమిటీలు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం తెనాలి నియోజకవర్గంలోని పట్టణ, రూరల్ మండల, కొల్లిపర మండలాలకు పార్టీ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు పంపారు. వివరాలిలా ఉన్నాయి.

తెనాలి పట్టణ క్లస్టర్–1: పార్టీ అధ్యక్షుడిగా మద్దాళి శేషాచలం, ఉపాధ్యక్షులు: దేవరపల్లి నాగభూషణం, మునిపల్లి సుబ్బారావు, **కోశాధికారి:** కొల్లా గురునాథగుప్త, ప్రధాన కార్యదర్శులు: తాడిబోయిన పెద్దబాబు, షేక్ కభీర్, మేకల చిరంజీవి, కార్యదర్శులు: పిల్లి తిరపతయ్య, దేవరపల్లి చంద్రశేఖరరెడ్డి, మేరుగ ప్రేమ్‌కిషోర్, షేక్ షరీఫ, బట్టు హరికిషన్, పాలపర్తి రామకోటేశ్వరరావు, కార్యవర్గసభ్యులు: పొట్లూరి అశోక్, చుక్కా ఆనంద్, తరకా శాంతికుమారి, బండి దుర్గాప్రసాద్, షేక్ ఖలీల్, కేతావత్ సంతోష్, షేక్ జకీర్‌హుస్సేన్ (జకీర్), సీహెచ్ సాయి (టోపీ సాయి), చెన్నాప్రగడ శ్రీనివాసరావు.

తెనాలి పట్టణ క్లస్టర్–2 పార్టీ అధ్యక్షుడు: షేక్ మహబూబ్ బాషా (దుబాయ్‌బాబు), ఉపాధ్యక్షులు: భాస్కరుని లక్ష్మీనారాయణ, కసుకుర్తి నాగమల్లేశ్వరరావు, కోశాధికారి: ఉడుముల చిన్నబాల కోటిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు: టి.పోలురాజు, తవ్వా రామిరెడ్డి, వై.నాగరాజు, కార్యదర్శులు: భరణి శ్రీనివాసరావు, చెట్టు శ్రీను, పిల్లి రఘు, కేసరి అంజిరెడ్డి, మునిపల్లి వంశీ, మల్లిబోయిన బుజ్జి నియమితులయ్యారు, కార్యవర్గసభ్యులు: షేక్ జిలాని, ఆరాధ్యుల నరేంద్ర, షేక్ వలిజాన్, షేక్ కరిముల్లా, మునావత్ వెంకటేశ్వరరావు, ఈపూరి ప్రసాదరావు, చుండూరు వెంకటేశ్వరరావు, రల్లి కిరణ్‌కుమార్.

తెనాలి రూరల్ మండలం

పార్టీ అధ్యక్షుడు: చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు: సంకురు బుజ్జిబాబు, వేమూరి శ్రీను, కోశాధికారి: బొంతు నరేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శులు: బి.రెడ్డి పున్నయ్య, కడియాల సురేష్, కొండారెడ్డి, కార్యదర్శులు: షేక్ సిలార్‌జాని, గోవతోటి సుధాకర్, తులాబంధుల లక్ష్మీకోటేశ్వరరావు, సురేష్, తాడిబోయిన యలమందరావు, కొండముది కిరణ్‌చంద్ర, కార్యవర్గసభ్యులు: తోట శ్రీకాంత్, బిజ్జాలి మహంకాళి, పాదిలి శ్రీనివాసరావు, రాచాబత్తుని విజయకుమార్, కఠె వరపు శివయ్య, రాచాబత్తుని వెంకటరత్నం, షేక్ బాషా, రమేష్, టి.సత్యనారాయణ.

కొల్లిపర మండలం

పార్టీ అధ్యక్షుడు: అవుతు పోతిరెడ్డి, ఉపాధ్యక్షులు: బేతాళం భూషణం, కట్టూరి నాగమల్లేశ్వరరావు, కోశాధికారి: మర్రెడ్డి బ్రహ్మారెడ్డి,ప్రధాన కార్యదర్శులు: అత్తలూరి రమేష్‌బాబు, మంద్ర రాజు, కార్యదర్శులు: ముడుసు చంద్రారెడ్డి, తాతా శ్రీనివాసరావు, ఉన్నవ ప్రవీణ్, గురువిందపల్లి గిరిబాబు, బొమ్ము వెంకటరెడ్డి, గరిక చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు: దేశబోయిన ఏడుకొండలు, అంబటి గంటయ్య, బ్రమరాంభ, గద్దే ప్రసాద్, మున్నంగి మహేశ్వరరావు, కల్లం నాగిరెడ్డి, కుసుమ గోపి, తాడిబోయిన రాంబాబు, మున్నంగి శ్రీనివాసరావు, పసుపులేటి రమేష్.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

తెనాలిరూరల్: వేర్వేరు ప్రాంతాల్లో రైలు కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల అందించిన వివరాలు.. కొలనుకొండ వంతెన వద్ద పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని శనివారం పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మరో ఘటనలో పెదవడ్లపూడికి చెందిన సాదం పిచ్చియ్య(87) పెదవడ్లపూడి స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు

కొల్లిపర: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్31 తేదీ రాత్రి ఎవరైనా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై చట్టపరమైన కేసులు నమోదుచేస్తామని ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి హెచ్చరించారు. ఆయన స్థానిక స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను యువకులు ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

'దిశా' కేసుల్ని త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నగరంపాలెం: దిశా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై దృష్టి సారించి, దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ ఆదేశించారు. దిశా పోలీస్‌స్టేషన్ (పీఎస్)ను శనివారం ఆయన తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ వద్ద బాధితులతో ఎస్పీ మాట్లాడారు. ఏ సమస్యపై వచ్చారు.. స్టేషన్ పోలీసు అధికారులు ఎలా స్పందించారనే అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదిదారుల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఎస్పీ ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా మెలగాలని సూచించారు. ప్రతి అర్జీని రిజిస్టర్‌లో నమోదు చేసి రశీదు అందించాలని చెప్పారు. న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలని తెలిపారు. రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలు, పాఠశాలలు వద్ద దిశా చట్టం, యాప్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. విజిబుల్‌గా ఉండేలా దిశా వాహనాలను నడిపి మహిళలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యామ్నాయ చర్యలు

కమిషనర్ జశ్వంతరావు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ జశ్వంతరావు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్న నేపథ్యంలో పట్టణంలో ప్రతిరోజు జరిగే పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. పట్టణ పరిధిలోని సచివాలయ శానిటరీ సెక్రటరీలతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సమ్మె వీడేంతవరకు శానిటరీ సెక్రటరీలు ఉదయం 5.30గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు. చెత్త సేకరించే వారికితో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి రోజు చెత్త సేకరణ నూరుశాతం జరిగే విధంగా చూడాలని చెప్పారు. ఎవరు విధులకు గైర్హాజరు కాకుండా సెలవు రోజుల్లో కూడా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంఈ కె.నాగమలేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘ నాయకులతో కమిషనర్ జశ్వంతరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మెను విరమించాలని సూచించారు. సమ్మెలో ఉండటం వలన పారిశుద్ధ్య నిర్వహణ పనులు పూర్తి స్థాయిలో జరగడం లేదని చెప్పారు. అందరూ సహకరించాలని కోరారు.

ప్రతిభావంతులైన చిన్నారులను ప్రోత్సహించాలి



చిన్నారి ప్రదీప్ నారాయణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రతిభావంతులైన చిన్నారులను ప్రోత్సహించాలని వల్లభాపురం గ్రామంలోని వినాయక స్వామి దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందు శేఖర్ పేర్కొన్నారు. రూరల్ మండలం గుడివాడ గ్రామానికి చెందిన అత్యంత ప్రతిభావంతుడైన రెండేళ్ల చిన్నారి ప్రదీప్ నారాయణ్ కుటుంబానికి శనివారం ఆయన సందర్శించారు. చిన్నారిని, తల్లిదండ్రులను అభినందించారు. జిల్లా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు ఆర్.శివకృష్ణ మాట్లాడుతూ పిల్లల ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించడం విశేషమన్నారు. చిన్నారుల ప్రతిభను మెరుగైన ప్రతిభగా మార్చేందుకు కుటుంబ పరిసరాలతో, మిత్రుల సహకారం ఉంటే భవిష్యత్తులో సమర్థులైన అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించగలుగుతారని విశ్రాంత సైనికోద్యోగి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మాణిక్యాలు మట్టిలో ఉన్నా మెరుస్తూనే ఉంటాయన్నారు. తెనాలి మండల స్వచ్ఛంద కార్యకర్త ప్రదీప్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన చిన్నారులకు ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలన్నారు. ప్రకృతి జీవన విధానం ప్రచారకులు ఉల్లంటి శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా అనేక మంది ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి సమాజానికి పరిచయం చేశామన్నారు. వీరితో పాటు ఆలపాటి వెంకటేశ్వరరావు తదితరులు చిన్నారిని అభినందించారు.

పరాజితులైన పోరాటయోధులను విస్మరించిన చరిత్ర

- చరిత్రలో నమోదుకానివన్నీ అబద్ధాలు కావు
- ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



మాట్లాడుతున్న చల్లపల్లి స్వరూపరాణి

తెనాలి: చరిత్ర విజేతలనే కీర్తించింది... వ్యక్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడి ఓడిపోయి, అన్నివిధాల నష్టపోయి, జీవితాలను కోల్పోయిన పరాజితులను విస్మరించిందని ప్రముఖ రచయిత్రి ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. వాస్తవానికి వీరే నిజమైన విజేతలని చెప్పారు. చరిత్రలో నమోదైనవన్నీ వాస్తవాలు కానట్టే, నమోదు కానివన్నీ అబద్ధాలు కావని స్పష్టంచేశారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక సంస్థ భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో నెలనెలా చర్చాకార్యక్రమంలో భాగంగా స్వరూపరాణి రచన 'మిణుగురులు'పై శనివారం రాత్రి స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చర్చావేదిక నిర్వహించారు. కనపర్తి బెనహర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. స్వరూపరాణి మాట్లాడుతూ, చరిత్రలో పురుషులు, ఆధిపత్య కులాల్లోని స్త్రీలకు స్థానం ఉందని చెబుతూ కులం, పితృస్వామ్యంచేత, వర్గపరమైన దోపిడీతో అనేకరకాలుగా హింసకు గురైన మహిళలకు స్థానం లేకుండా పోయిందన్నారు. 'మిణుగురులు' పుస్తకంలో అణగారిన వర్గాల్లోని ధిక్కారచేతనాలైన మహిళల గాథలను పొందుపరిచినట్టు తెలిపారు. ఇందులోని పాత్రలన్నీ సజీవమనీ, కులసమాజం విధించిన నిషేధపుటాజ్ఞలను ధిక్కరించి, విలువలు, ఆత్మగౌరవం కోసం జీవితాలను ధారపోశారని చెప్పారు. నవీన సమాజ ఆవిష్కరణకు సరికొత్త చరిత్రను నిర్మించారని సోదాహరణంగా వివరించారు. చరిత్ర రచనల్లో దుర్మార్గమైన ప్రచారం జరుగుతోందని విమర్శించారు. అణగారిన కులాలు, స్త్రీలు, ఆదివాసీలు, మైనారిటీలు వివిధ చారిత్రక సందర్భాల్లో చేసిన పోరాటాలను నిర్లక్ష్యం చేసి, ఆమోదించినవారు, వకల్తా పుచ్చుకున్నవారి చరిత్రలనే పాఠ్యాంశాల్లో పొందుపరుస్తున్నట్టు ఆరోపించారు. అణగారిన వర్గాల పోరాటాలు, యుద్ధాలు, చరిత్రను ఆయా వర్గాలకు తెలియజేయాలని పూలే, అంబేడ్కర్ చేసిన ప్రయత్నాన్ని స్వరూపరాణి వివరించారు. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి మందరపు హైమవతి మాట్లాడుతూ, మిణుగురులు పుస్తకంలోని స్త్రీ పాత్రల చరిత్ర ఉత్తేజాన్నిస్తాయని చెప్పారు. రచయిత పిల్లి వాసు తన ప్రసంగంలో, చరిత్ర విస్మరించిన పోరాటయోధుల చరిత్రలను సమాజానికి అందించకపోతే భావితరాలకు అన్యాయం చేసినట్టు కాగలదన్నారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ భావజాలంతో చరిత్రను రాసే రచనలు రావాలని అభిప్రాయపడ్డారు. భిన్నస్వరాలు బాధ్యులు జుగాష్‌విలి, రాఘవరెడ్డి, ఉమ పర్యవేక్షించారు.

సాంఘిక పద్యనాటకంతో యువతకు చేరువ

నాటక రచయితల సదస్సులో నాటకరంగ ప్రముఖులు



నటరాజుకు పూలమాల సమర్పించిన డాక్టర్ మీగడ రామలింగస్వామి

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలిలో తొలిసారిగా నాటక పోటీల ఆరంభమైన వందేళ్లకు, ఇదే పట్టణ వేదికపై సమకాలీన సాంఘిక పద్యనాటకంతో నేటి యువతరానికి చేరువ కావాలనే కొత్త ఆలోచన పురుడు పోసుకుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుప్రసిద్ధ నాటక రచయితలతో సదస్సు దీనిని బలపరిచింది. తగిన కార్యాచరణకు ముందుకు సాగుదామన్న నిర్ణయానికి వచ్చారు. కళల కాణాచి- తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్- విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో శనివారం సదస్సు నిర్వహించారు. దాదాపు పాతికమంది సుప్రసిద్ధ నాటక రచయితలు, దర్శకులు హాజరయ్యారు. విశాఖపట్నానికి చెందిన సుప్రసిద్ధ నాటక రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి నటరాజస్వామికి పూలమాల సమర్పణతో సదస్సు ప్రారంభమైంది. పద్యనాటకం అంశాలపై మధ్యాహ్నం వరకు, అప్పట్నుంచి సాంఘిక నాటక రచనలపైనా నాటకరంగ ప్రముఖులు విశ్లేషణ చేశారు. పద్యనాటకంలో ప్రాచీన సంప్రదాయ నాటకం, ఆధునిక సాంఘిక నాటకం అనే రెండు ఆలోచనలను కొనసాగాలన్న భావన వ్యక్తమైంది. సంప్రదాయ పద్యనాటకాన్ని బతికించుకుంటూనే, ఆధునిక సమకాలీన సాంఘిక పద్యనాటకాలను తీసుకురావాలని సూచించారు. అంటే పద్యనాటకం, సాంఘిక పద్యనాటకం రెండు కళ్లుగా ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు చెప్పారు.

సాంఘిక పద్యనాటకాలకు కార్యశాలలు నిర్వహించాలని డాక్టర్ మీగడ రామలింగస్వామి సూచించారు. రైల్వే కోడూరు పద్యనాటక రచయిత, దర్శకుడు, ప్రయోక్త శారదా ప్రసన్న మాట్లాడుతూ వేమన శతకంలోని శైలితో ఉంటే పద్యాలు తీసుకొస్తే భేషుగ్గా ఉంటుందని చెప్పారు. కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడారు. రంగస్థల నటులు, దర్శకులు, ప్రయోక్తలు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు(మధిర), డాక్టర్ దీర్ఘాశి విజయభాస్కర్(హైదరాబాద్), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (చిలకలూరిపేట), డాక్టర్ బీవీ రామారావ్(హైదరాబాద్), మాస్టర్ ఆఫ్ ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ బి.శివకాశి(చేబ్రోలు) విశ్లేషించారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. వేద గంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వరప్రసాద్, కళల కాణాచి బాధ్యులు చెరుకుమల్లి సింగారావు, గోగినేని కేశవరావు, కొండముది రమేష్‌బాబు, దేవరపల్లి భవాని పర్యవేక్షించారు.

అందుబాటులో పుస్తకాలు

చెరుకుపల్లి: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు చెరుకుపల్లి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని చెరుకుపల్లి గ్రంథపాలకురాలు కె.అరుణ శనివారం తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : TENALI

H.M.O.P.NO. 225 OF 2023

Between:-
Maddirala Padmavathi @ Venkata Padmavathi ..Petitioner
And
Maddirala Subrahmanyam ..Respondent

To
Maddirala Subrahmanyam, S/o late Venkateswara Rao, Tailoring work C/o Gudibandi Basiv Reddy, D.No.5-2A, Kollipara (v) & (M), Guntur District Ph.7382443550

Take notice that the above petition filed by the petitioner seeking divorce from you and the said petition stands posted to 02-01-2024 for your appearance as such you are hereby required to appear before the above court on 02-01-2024 at 10-30 a.m. either personally or through an advocate file your objections if any, failing which the matter will be determined in your absence.
Hearing date: 02-01-2024 at 10.30 a.m.
Tenali
Date: 24-12-2023

B.M.S.DURGA PRASAD
Advocate for Petitioner,Tenali

• న్యూ ఇయర్ జోష్.. కెవ్వు కేక్ !

పట్టణంలో కేక్ మేళాలు













తెనాలిలో కొత్త సంవత్సర సందడి ప్రారంభమైంది. 2024 సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం గంగానమ్మపేటలోని శశి డెలిషియస్ కేక్ మేళాలో భాగంగా పలు నమూనాలతో కేక్‌లను నిర్వాహకులు ప్రదర్శించారు. వాటిలో 2024 అనే అక్షరాలతో కొన్ని, మౌంటెన్, గౌన్, టెడ్డీబేర్, వినాయకుని చిత్రం ఉన్న, ఫ్లవర్ బొకే నమోనాలతో పలు కేక్‌లను తయారు చేశారు. వాటిని ఆదివారం శశి గ్రూప్ ఆఫ్ సంస్థల్లో విక్రయించనున్నారు. ఇవి చూడటానికి ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం వివిధ రకాల రూపాలతో కేక్‌లను తయారు చేయడం వీరి ప్రత్యేకత. – తెనాలి అర్బన్